జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 12 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8

చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు

- నేటి నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని పది ప్రాంతాల్లో పంపిణీ
- జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడి



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 11,ప్రజాజ్యోతి: కొత్తగూడెం జిల్లాలో చేయూత పింఛన్లకు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ బుధ వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలు, మున్సి పాలిటీల పరిధిలో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పంపిణీ

మిగతా 3 లో...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి నాయకులకు మహర్దశ




- పెండింగ్ సమస్యల పరిష్కారానికి మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ
- ఉత్తమ కుమార్ రెడ్డితో మంత్రి తుమ్మల 15 నిమిషాల పై కీలక భేటీ

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 11, (ప్రజాజ్యోతి) సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపడం.. అసంపూర్తి పనులను పూర్తి చేయడం.. కొత్త ప్రతిపాదనలకు అను మతులు సాధించడం.. వరద ముప్పు నుంచి పట్టణాలు, గ్రామాలకు రక్షణ కల్పించడంతోపాటు చెరువులను అభి వృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో సాగునీటి రంగానికి సంబంధించిన కీలక అంశా లపై రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభి వృద్ధి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో బుధవారం సమావేశమై సమ గ్రంగా చర్చించారు. రెండు జిల్లాలకు సంబంధించి మొత్తం 15 అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కా రానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న అవరో ధాలు, ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధుల కేటాయిం పులు, వరద రక్షణ పనులు,

మిగతా 2 లో...

- పాలసీల వేటలో కొందరు ఉపాధ్యాయులు...
- చదువు లేక విద్యార్థులు విలవిల..! తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు..!!
- పాలసీలపైనే సుమారు 1000 మంది టీచర్లు..? మొత్తం 2000 మంది బడికి డుమ్మా..?
- ఖమ్మం డీఈఓ సైలెంట్.. అనుమానాలు వైలెంట్..!
- జిల్లా అధికారికి తెలిసే జరుగుతోందా..? లేక దగ్గరుండి నడిపి స్తున్నారా..?
- స్పందించిన భద్రాద్రి డీఈఓ .. ఆలా చేస్తే కఠిన చర్యలు తప్పవు...
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రంగంలోకి దిగి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని పలువురు విజ్ఞప్తి..!



5 లో..

ప్రభుత్వ చదువు అంగట్లో..! టీచర్స్ ఎక్కడ..!!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ చదువు అంగట్లో పడిపోయింది. పిల్లలు బడిలో చదువు కోసం ఎదురుచూస్తుంటే, కొందరు టీచర్లు బడికి డుమ్మా కొడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 2000వేల మంది టీచర్లు బడికి వెళ్లడం లేదని, అందులో 1000 మంది పాలసీల వేటలోనే ఉన్నారని ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. సర్కారు జీతం తీసుకుంటూనే ప్రైవేట్ పాలసీల దందా చేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. చదువు లేక విద్యార్థులు విలవిలలాడుతుంటే, భద్రాద్రి జిల్లా డీఈఓ స్పందిస్తే, ఖమ్మం డీఈఓ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, (ప్రజాజ్యోతి)

ప్రజలకు మేలు జరిగేలా భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఈ నెలాఖరులోగా తొలి విడత రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- అవకతవకలకు పాల్ప డితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు

- కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 11, (ప్రజాజ్యోతి) రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరి గేలా, ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించా లని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశిం చారు. రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి తప్పులు జరగకుండా పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్

మిగతా 2 లో...

తుఫాన్ నష్టంపై సీఎంకు ఎమ్మెల్యే జారే వినతి

- అశ్వారావుపేట నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి
- దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చెరువుల పునరుద్ధరణకు విజ్ఞప్తి..
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి



2 లో...

తుఫాన్ నష్టంపై సీఎంకు ఎమ్మెల్యే జారే వినతి

దమ్మపేట,నవంబర్ 11 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నియోజకవర్గంలో తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని వివరించారు. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో భారీ వర్షాలు, వరదలతో రహదారులు, వంతెనలు, చెరువులు, కాలువలు దెబ్బతిన్నాయని తెలిపారు. పలు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలకు మరమ్మతులు చేపట్టి, సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని నష్ట నివారణ, పునరుద్ధరణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి...)

చెరువుల పునరుద్ధరణతదితర అంశాలను మంత్రి వివరించారు. రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు ఖమ్మం నగరానికి తాగునీటి భద్రత కల్పించడం, మున్నేరు వరద ముప్పును తగ్గించడం, చెరువులను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

సీతమ్మసాగర్ పనుల పునఃప్రారంభానికి కసరత్తు

కొత్తగూడెం జిల్లా లో కీలకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులు ఎన్‌జీటీ కేసు కారణంగా నిలిచిపోయిన నేపథ్యంలో వాటిని తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను మంత్రి తుమ్మల ప్రస్తావించారు. పర్యావరణ అనుమతుల సాధనకోసం ఎపిటిఆర్ఐ, హైదరాబాద్ ద్వారా ఈ నెల 9న పారివేశ్ పోర్టల్‌లో ప్రతిపాదనలు సమర్పించినట్లు వివరించారు. ఈఏసీ కన్వీనర్ వై.పి.సింగ్‌తో సంప్రదింపులు జరిపి పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైన క్లియరెన్సులు సాధించి ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి మార్గం సుగమం చేయాలని కోరారు. అదేవిధంగా సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన జూలూరుపాడు టన్నెల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే పథకంలోని ప్యాకేజీ-11 పరిధిలో పంప్‌హౌస్-4 నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వివరిస్తూ, వాటిని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని మంత్రి కోరారు,

ప్రజలకు మేలు జరిగేలా భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



(మొదటి పేజీ తరువాయి...)

అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఐడీఓసీ కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డిమాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో రీసర్వే పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లోనూ రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు మంత్రి తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో రీసర్వేను పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆదేశించారు. రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో పారదర్శకతతో పాటు కచ్చితత్వం తప్పనిసరిగా ఉండాలని, సర్వే చేపట్టే గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించి, వారి సమక్షంలోనే భూముల కొలతలు నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన అవగాహన, కౌన్సెలింగ్ కల్పించాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్న నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రెవెన్యూ రికార్డులు ఎలాంటి తప్పులు లేకుండా కచ్చితత్వంతో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి తెలిపారు. ముఖ్యంగా అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని సూచించారు. పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉంటే వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి అంశాలు పెండింగ్‌లో ఉండకుండా సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు.ప్రజల భూములకు సంబంధించిన అంశాల్లో ఏ అధికారి అయినా అక్రమాలకు,అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను నాణ్యతతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడీ సర్వే శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ సవేరాం, ఇల్లందు తాసిల్దార్ ఖాసీం సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి నాయకులకు మహర్దశ

వెంకమ్మ చెరువు కాలువకు ఆమోదం ఇవ్వాలి

అశ్వారావుపేట నుంచి దబ్బతోగు, ఆసుపాక గ్రామాల్లోని చిన్న నీటిపారుదల చెరువులకు నీరందించే వెంకమ్మ చెరువు వరద ప్రవాహ కాలువ నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ పనులకు రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ మే 11న ఆమోదం తెలిపిందని, సెప్టెంబరు 10న ప్రభుత్వానికి పంపిన ఫైలు పెండింగ్‌లో ఉందని వివరించారు. సంబంధిత ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు.

పెద్దవాగు ప్రాజెక్టుకు శాశ్వత పునరుద్ధరణ

పెద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్నకట్టకు శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. ఇందుకు సంబంధించిన అంచనాలను 2025 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. ఈ పనులకు తెలంగాణ రాష్ట్ర వాటాగా రూ.3.40 కోట్లు చెల్లించేందుకు సమ్మతి తెలియజేయాలని ఏపీ ప్రభుత్వం కోరిందని, దీనికి సంబంధించిన ఫైలు తెలంగాణ ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పైపుల ద్వారా సాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు

సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌లోని ప్యాకేజీలు 1, 2, 7, 8 పరిధిలో సంప్రదాయ గ్రావిటీ కాలువలకు బదులుగా ప్రెషరైజ్డ్ పైప్డ్ ఇరిగేషన్ నెట్‌వర్క్ విధానాన్ని అమలు చేసే ప్రతిపాదనలను మంత్రి ప్రస్తావించారు. ఈ మేరకు అక్టోబరు 17నప్రభుత్వానికిప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. వీటికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పైపుల ద్వారా సాగునీటి సరఫరా వ్యవస్థ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజర్వాయర్లపై తేలియాడే సౌర విద్యుత్ కేంద్రాలు

పీఎం సూర్య సరోవర్ యోజన కింద సాగునీటి రిజర్వాయర్లపై ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థతో కూడిన ఫ్లోటింగ్ సోలార్ ఫొటోవోల్టాయిక్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రూపొందించిన ప్రతిపాదనలను కూడా మంత్రి వివరించారు. వాటిని త్వరగా పరిశీలించి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

మరేళ్లపాడు ఎత్తిపోతల పథకానికి ముందడుగు

మరేళ్లపాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి గ్రావిటీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ ప్రతిపాదనలు ప్రస్తుతం ఇంజనీర్-ఇన్-చీఫ్ స్థాయిలో పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరగా ముందుకు తీసుకెళ్లడంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఎంసీఏడీ పథకంలో ఈ ప్రాజెక్టును చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దోమలవాగు చెరువు సామర్థ్యం పెంపు

బూర్గంపాడు మండలం వేపలగూడెం పరిధిలోని దోమలవాగు చిన్ననీటిపారుదల చెరువు సామర్థ్యాన్ని 0.48 టీఎంసీలకు పెంచేందుకు రూపొందించిన ప్రతిపాదనలను మంత్రి ప్రస్తావించారు. ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలో ఉన్న ఈ ప్రతిపాదనలకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

మల్లెపులవాగుకు వరద రక్షణ.. భేతుపల్లి చెరువు అభివృద్ధి

మురసు తుఫాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొట్టుకపోయిన మల్లెపూల వాగు కట్టలకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని,భారీ వరదల నేపథ్యంలో భేతుపల్లి ప్రాజెక్టుకు నీరందించే మల్లెపుల వాగుకు శాశ్వత ప్రాతిపదికన రక్షణ కల్పించాల్సిన అవసరాన్నిమంత్రి వివరించారు. భవిష్యత్తులో వరదల కారణంగా నష్టం వాటిల్లకుండా అవసరమైన రక్షణ పనులు చేపట్టాలని కోరారు. భేతుపల్లి పెద్ద చెరువు సామర్థ్యాన్ని పెంచేందుకురూపొందించాల్సినప్రతిపాదనలను పరిశీలించితదుపరి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఖమ్మం నియోజకవర్గానికి వరద ముప్పు నుంచి రక్షణ

ఖమ్మం నియోజకవర్గంలోనూ సాగునీటి,వరదనివారణ,చెరువుల అభివృద్ధికి సంబంధించి నాలుగు కీలక ప్రతిపాదనలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాగునీటి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా మున్నేరు వరదల నుంచి పరివాహక ప్రాంతాలకు రక్షణ కల్పించే అంశానికిప్రాధాన్యమిచ్చారు.

ధంసలాపురం వరకు మున్నేరు రక్షణ గోడ

మున్నేరు నదికి వరదలు వచ్చిన ప్రతిసారీ పరివాహక ప్రాంతాలు, నివాస ప్రాంతాలు ముంపు ముప్పును ఎదుర్కొంటున్ననేపథ్యంలో ధంసలాపురం వరకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని మంత్రి కోరారు. నదికి ఇరువైపులా వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన రక్షణ చర్యలు చేపడితే భవిష్యత్తులో వరదల వల్ల ప్రజలు, ఆస్తులకు కలిగే నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు.ఈమేరకు రక్షణగోడనిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రణాళిక

ఖమ్మం నియోజకవర్గంలోని ధంసలాపురం పెద్దచెరువు,ఖానాపురం ఊరచెరువుతోపాటు ఇతర చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు చేపట్టాలని మంత్రి ప్రతిపాదించారు. చెరువుల్లో పూడిక తొలగింపు, నీటి నిల్వ సామర్థ్యం పెంపు,పరిసరాల అభివృద్ధి వంటి పనులతో వాటిని మరింత వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణతో పాటు వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు.

లకారం చెరువుకు నీటి మళ్లింపునకు రూ.8 కోట్లతో రెగ్యులేటర్

ఖమ్మం నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని లకారం చెరువును నింపేందుకు టేకులపల్లి వద్ద రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కోరారు. ఈ రెగ్యులేటర్ ద్వారా అవసరమైన నీటిని లకారం చెరువుకు మళ్లించి, నగర తాగునీటి అవసరాలకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే ఖమ్మం నగర నీటి వనరుల బలోపేతానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఉత్తమ్ సానుకూల స్పందన

కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రస్తావించిన 15 కీలక అంశాలపై సాగునీటి శాఖ మంత్రి ఉత్తమకుమారరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ సమస్యలు, అనుమతులు,ప్రతిపాదనలు,నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, వరద రక్షణ పనులు, తాగునీటి వనరుల బలోపేతం వంటి అంశాలపై మంత్రి తుమ్మల చూపుతున్న చొరవతో రెండు జిల్లాల్లో సాగునీటి రంగానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు ఆమోదం లభించి పనులు కార్యరూపం దాల్చితే రైతులకు సాగునీటి వసతులు మెరుగుపడటంతోపాటు ఖమ్మం నగర తాగునీటి అవసరాలకు మరింత భద్రత లభించనుంది. వరద ముప్పు నుంచి ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు చెరువుల అభివృద్ధికి కూడా మార్గం సుగమం కానుంది.

పీ.వి.టి.జి. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు గడువులోగా పూర్తి చేయాలి

- అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం
- భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్



భద్రాచలం, నవంబర్ 11 (ప్రజా జ్యోతి): పీ.వి.టి.జి.గ్రామాల్లో వీబీ–జీరామ్‌జీ పథకం కింద చేపట్టిన ఉపాధి హామీ పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవి డ్ రాజ్ తెలిపారు.బుధవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్యదేవరాజన్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశాల మేరకు ఏజెన్సీ ప్రాంతంలోని పీ.వి.టి.జి. గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం,బోరు బావుల రీఛార్జ్ పనులు, వ్యవసాయ కుంటల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని డేవిడ్ రాజ్ సూచించారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని గ్రామాల్లో పనులను పర్యవేక్షించి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

రూ.6.90 లక్షల విలువైన గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం



భద్రాచలం, నవంబర్ 11 (ప్రజా జ్యోతి): భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 11.600 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ శ్రీహరిరావు సిబ్బందితో కలిసి కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే మార్గంలోని ఇసుక రీచ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పల్సర్ ఎన్ఎస్ 200 ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 11.600 కిలోల గంజాయి లభించింది.గంజాయిని మల్కన్‌గిరి నుంచి సిద్ధిపేటకు తరలిస్తున్న కాల్వ వెంకటేశ్, కోడూరు సురేశ్‌లను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.6.90 లక్షలుగా అంచనా వేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులు, స్వాధీనం చేసుకున్న వస్తువులను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కానిస్టేబుళ్లు శివకుమార్, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్, డ్రైవర్ సాయిరామ్ పాల్గొన్నారు.గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే 18004252523 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సరఫరాపై ఎంపీడీవో సంకీర్త్ సమీక్ష సమావేశం



పినపాక,నవంబర్ 11(ప్రజాజ్యోతి) మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ప్రత్యేక డ్రైవ్ నిర్వహణపై ఎంపీడీవో సంకీర్త్ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం పినపాక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు.నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు చేపట్టనున్నప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి, మిషన్ భగీరథ బల్క్ సప్లై, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, చేతిపంపులు, బోరుబావులు, పైప్‌లైన్ మరమ్మతులు, నీటి ఎద్దడి సమస్యలపై సమీక్షించారు. ప్రతి ఆవాసాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి తాగునీటి సమస్యలను గుర్తించాలని కార్యదర్శులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామ సర్పంచులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు,సెక్రటరీలు పాల్గొన్నారు

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత

- వైద్య చికిత్స కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత



భద్రాచలం, నవంబర్ 11 (ప్రజా జ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద మహిళ వైద్య చికిత్సకు వసుధ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించింది. భద్రాచలం పట్టణానికి చెందిన మహిళ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా,ఆమె భర్త మాడుగుల సత్యనారాయణ వైద్యఖర్చుల కోసం ఫౌండేషన్ ను సంప్రదించారు.దీనిపై స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజుకు సూచించారు. ఈ మేరకు బుధవారం భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును బాధిత మహిళ భర్త సత్యనారాయణకు అందజేశారు.ఆపదలో ఉన్న పేదకుటుంబానికి చేయూతనందించిన వసుధ ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సట్ల రాజు, వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలి

- అఖిలభారత రైతు సంఘం 36వ మహాసభలను జయప్రదం చేయండి
- రైతు సంఘం సీనియర్ నాయకులు బీబీజీ తిలక్

భద్రాచలం,నవంబర్ 11 (ప్రజా జ్యోతి): అఖిలభారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకులు బీబీజీ తిలక్ పిలుపునిచ్చారు. బుధవారం కామ్రేడ్ చందర్రావు భవన్‌లో రైతు సంఘం జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.దేశవ్యాప్తంగా రైతులు ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, పంట నష్టాలు, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.పంట నష్టాలపై క్షేత్రస్థాయిలో అంచనాలు వేసి తక్షణమే పరిహారం అందించాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.నాణ్యమైన విత్తనాలు,ఎరువులను సకాలంలో అందించాలని కోరారు.రైతుల హక్కుల పరిరక్షణకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే 36వ జాతీయ మహాసభల్లో రైతాంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 12వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు, నవంబర్ 13వ తేదీన ఉదయం 10 గంటలకు సుజాతనగర్ మండల లబ్ధిదారులకు రైతు వేదికలో, ఉదయం 11 గంటలకు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి లబ్ధిదారులకు కొత్తగూడెం క్లబ్‌లో మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పాల్వంచ మండలం,మున్సిపాలిటీ పరిధి లబ్ధిదారులకు పాల్వంచలో పంపిణీ చేయనున్నారు.అదేరోజు ఉదయం 10గంటలకు అశ్వారావుపేట మండలం, మున్సిపాలిటీ పరిధిలో అశ్వారావుపేటలో, మధ్యాహ్నం 2 గంటలకు దమ్మపేట మండల కేంద్రంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నవంబర్ 14వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ములకలపల్లి మండల కేంద్రంలో, నవంబర్ 15వ తేదీన ఉదయం 10 గంటలకు చంద్రుగొండ మండల కేంద్రంలో, మధ్యాహ్నం 2 గంటలకు అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో చేయూత పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని మిగిలిన మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో కూడా చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని తదుపరి షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీలు, సమయాలు,వేదికల వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు .సంబంధిత మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లబ్ధిదారులు తమకు కేటాయించిన తేదీ, సమయం, వేదికకు హాజరై మంజూరు పత్రాలను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. పంపిణీ కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలు అవసరం

- అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభల సందర్భంగా గ్రామ జనరల్ బాడీ సమావేశం
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న

పినపాక,నవంబర్ 11(ప్రజాజ్యోతి) పినపాక మండలంలోని తోగ్గుడెం గ్రామ పంచాయతీ టేకుల గుంపు లో అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా గ్రామ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ నిమ్మల వెంకన్న పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రైతుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం,వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు,ఎరువులు,విత్తనాలు సకాలంలో అందించడం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలు అవసరమన్నారు.నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో రైతులను,వ్యవసాయ కార్మికులను సమీకరించి మహాసభల ఉద్దేశాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు కామ్రేడ్ కురసం లక్ష్మయ్య, గ్రామ నాయకుడు కళ్యాణ్,గ్రామస్థాయి నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయాలని సీఎంకు ఎమ్మెల్యే లేఖ



భద్రాచలం,నవంబర్ 11(ప్రజా జ్యోతి): వెంకటాపురం మండలం వీఆర్ పురం గ్రామానికి చెందిన బద్ది సడాలమ్మ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.మయోసైటిస్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సడాలమ్మకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అవసరమని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బాధితురాలి పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

తోగూడెం విద్యార్థులకు మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ



పినపాక,నవంబర్ 11(ప్రజాజ్యోతి) పినపాక మండలం తోగూడెం గ్రామంలోని జీఎస్ఎస్ చైల్డ్ కేర్ సెంటర్‌లో మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రామటెంకి రమేష్ సోదరులు రామటెంకి నరసింహారావు, వెంకన్న ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు స్వయంగా దుస్తులు అందజేశారు. సొంత గ్రామంలోని విద్యార్థులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామటెంకి రమేష్, దేవి దంపతుల సేవలను స్థానికులు అభినందించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారి అవసరాలను గుర్తించి సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. జీఎస్ఎస్ చైల్డ్ కేర్ సెంటర్ టీచర్ మైపా రమాదేవి, ఇన్‌చార్జ్ బడే సాగర్, గ్రామస్థుల గాంధర్ల సాంబశివరావు, ఊకే కోటి పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

చర్ల,నవంబర్ 11:(ప్రజాజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించడం ద్వారా తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్ద ఆశాలత అన్నారు.చర్ల మండలం బెస్త కొత్తూరు గ్రామానికి చెందిన రైతు నల్లూరి రామకృష్ణసతీమణి తులసికుమారి జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు నల్లూరి రూప్ చంద్–శిరీష దంపతులు వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలోని కొమరం భీమ్ శబరి బాలికా నిలయంలో విద్యార్థినులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆశాలత మాట్లాడుతూ వనవాసీ కళ్యాణ పరిషత్ ఆదివాసీల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తోందని, విద్య,వైద్య సదుపాయాలు కల్పిస్తూ వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. సంస్థ ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందకుండా కేవలం దాతల సహకారంతోనే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు.వనవాసీ సంస్థకు నల్లూరి కుటుంబం అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రతి ఏటా విద్యార్థుల చదువులకు, సంక్షేమానికి ఆ కుటుంబం సహకారం అందించడం అభినందనీయమన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.నిలయ కమిటీ సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్,నల్లూరి కృష్ణార్జునరావు దంపతులు,సూరి బాబు దంపతులు,కుటుంబ సభ్యులు పెద్దాడ గీతానంద్,హితానంద్,నిలయ ప్రముఖ్‌లు వరలక్ష్మి,సంతోష్,ముఖేష్,వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలి

- భద్రాచలంలో వివిధ శాఖల అధికారులు, ఇంజనీర్లు, కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్లతో సమీక్ష
- ఆలయ అభివృద్ధి పనులు, నూతన పుష్కర ఘాట్ నిర్మాణాలను పరిశీలించిన
- తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్





భద్రాచలం, నవంబర్ 11 (ప్రజా జ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో చేపడుతున్న ఘాట్ల అభివృద్ధి, ఆలయ పరిసరాల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి శ్రీరామనవమి నాటికి పూర్తిచేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠతో కలిసి ఆలయ అభివృద్ధి పనులు, నూతన పుష్కర ఘాట్ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు,ఇంజనీర్లు,కన్సల్టెంట్లు,కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుష్కరాలకు దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్యం, రవాణా, భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వీఐపీలు, సాధారణ భక్తులకు వేర్వేరుగా పార్కింగ్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, పుష్కర వనానికి అనువైన స్థలాన్ని సేకరించి,భక్తుల కోసం వసతి గృహాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.దేవస్థానం, పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.348.59 కోట్ల నిధులు కేటాయించిందని, పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయలోపం వల్ల పనులు నిలిచిపోకూడదని, సమస్యలను కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

భద్రాద్రి రామయ్య సేవలో.... రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్

- స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, జ్ఞాపికలను అందజేసిన ఆలయ ఈవో



భద్రాచలం, నవంబర్ 11 (ప్రజా జ్యోతి): భద్రాద్రి సీతారామచంద్రస్వామివారిని రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకున్న అనంతరం అంతరాలయంలో మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే.దామోదర్ రావు,ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలుగా గొడ్లరాణి నియామకం

- నియమక పత్రం అందించిన గద్దల రమేష్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్




అశ్వాపురం, నవంబర్ 11,ప్రజాజ్యోతిఅశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలుగా గొడ్ల రాణి నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆమెకు బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ఎస్సీ సెల్ నాయకులు మరియు కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దళిత సమాజ శ్రేయస్సుకు, వారి హక్కుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. అశ్వాపురం మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మహిళా విభాగాన్ని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడంలో గొడ్ల రాణి క్రియాశీలక పాత్ర పోషిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.అశ్వాపురం మండలంలో పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తెస్తూ, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆయన సూచించారు తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్‌తో పాటు స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, నియోజక వర్గ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అశ్వాపురం మండలంలో ఎస్సీ సెల్ మహిళా విభాగాన్ని మరింత క్రియాశీలంగా తీర్చిదిద్ది, కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తానని గొడ్లరాణి ఆమె హామీ ఇచ్చారు.

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా చండ్రుగొండ ZPHS పాఠశాలలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం



చండ్రుగొండ నవంబర్ 11 (ప్రజా జ్యోతి) : భారతదేశ స్వతంత్ర సమరయోధుడు,భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి,భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 11 న జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను చండ్రుగొండ ZPHS పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చండ్రుగొండ యూత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలుగా వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విద్య యొక్క ప్రాముఖ్యత, సమాజ అభివృద్ధిలో విద్య పాత్ర, విద్యార్థుల భవిష్యత్తు వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రసంగాలతో ప్రతిభను చాటుకున్నారు.ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు షీల్డులు, మెడల్స్ అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు పేర్కొన్నారు.ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి చండ్రుగొండ మండల ఎస్ఐ విజయకుమారి, ZPHS పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ఉప్పల్ రెడ్డి, ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ, చండ్రుగొండ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి సురేష్, 3వ వార్డు సభ్యులు ఎస్కే ఇమ్రాన్ పాషా, ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ బాబా సార్, మైనారిటీ నాయకులు ఎండీ షబ్బీర్, ఎండీ సాబీర్, ఎండీ నయీం, అతిక్, నాబిద్, ఎస్కే వసీం పాషా, సీహెచ్. మనోహర్, కడియాల పుల్లయ్య తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.అలాగే పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో విద్యపట్ల ఆసక్తిని,పోటీతత్వాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన చండ్రుగొండ యూత్‌ను పలువురు అభినందించారు.

- పాలసీల వేటలో కొందరు ఉపాధ్యాయులు...
- చదువు లేక విద్యార్థులు విలవిల..! తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు..!!
- పాలసీలపైనే సుమారు 1000 మంది టీచర్లు..? మొత్తం 2000 మంది బడికి డుమ్మా..?
- ఖమ్మం డీఈఓ సైలెంట్.. అనుమానాలు వైలెంట్..!
- జిల్లా అధికారికి తెలిసే జరుగుతోందా..? లేక దగ్గరుండి నడిపిస్తున్నారా..?
- స్పందించిన భద్రాద్రి డీఈఓ .. ఆలా చేస్తే కఠిన చర్యలు తప్పవు...
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రంగంలోకి దిగి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని పలువురు విజ్ఞప్తి..!



ప్రభుత్వ చదువు అంగట్లో..!

టీచర్స్ ఎక్కడ..!!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ చదువు అంగట్లో పడిపోయింది. పిల్లలు బడిలో చదువు కోసం ఎదురుచూస్తుంటే, కొందరు టీచర్లు బడికి డుమ్మా కొడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 2000వేల మంది టీచర్లు బడికి వెళ్లడం లేదని, అందులో 1000 మంది పాలసీల వేటలోనే ఉన్నారని ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. సర్కారు జీతం తీసుకుంటూనే ప్రైవేట్ పాలసీల దందా చేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చదువు లేక విద్యార్థులు విలవిలలాడుతుంటే, భద్రాద్రి జిల్లా డీఈఓ స్పందిస్తే, ఖమ్మం డీఈఓ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, (ప్రజాజ్యోతి)

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై గ్రౌండ్ లో విచారణ చేయగా దిమ్మతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావడం లేదని, కొన్ని చోట్ల తరగతులు ఖాళీగా ఉంటున్నాయని తెలుస్తోంది. కొందరు ఉపాధ్యాయులు వ్యక్తిగత పనులు, ప్రైవేట్ వ్యాపారాల్లో బిజీగా ఉంటూ పాఠశాలలను పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థుల చదువు తీవ్రంగా దెబ్బతింటోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన వివరణ రాకపోవడం పలు అనుమానాలకు కూడా దారితీస్తోంది.

పాలసీల వేటలో కొందరు గురువులు..! బడి వదిలి బేరాల వేట..!

ఉమ్మడి జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు తమ వృత్తిని పక్కన పెట్టి ఇతర ఆదాయ మార్గాల వెంట పరుగులు పెడుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. పాఠశాల సమయంలోనే బయట తిరుగుతూ ప్రైవేట్ పాలసీల పనులు చూసుకుంటున్నారని తెలుస్తోంది. కొందరు తమకు అనుకూలంగా సెలవులు చూపించుకుంటూ విధులకు దూరంగా ఉంటున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. మరి కొందరు తమ స్థానంలో ఇతరులను ఉంచి హాజరు చూపిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీని వల్ల తరగతి గదుల్లో పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులు అనేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నుంచి నెల నెలా వేతనం అందుకుంటూనే బయట సంపాదనపై దృష్టి పెట్టడం సరికాదని విద్యావేత్తలు అంటున్నారు.

పాఠం లేక పిల్లలు పాట్లు..! తల్లిదండ్రులకు గుండె కోత..!


పాఠశాలకు వెళ్లిన పిల్లలు సాయంత్రం వరకు పాఠాలు వినకుండానే ఇంటికి తిరిగి వస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్ని బడుల్లో ఒకే టీచర్ అన్నితరగతులను చూసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. సిలబస్ పూర్తి కాకపోవడంతో పరీక్ష లంటే పిల్లలు భయపడుతున్నారని కొందరు ఉపాధ్యాయేతర సిబ్బంది అంటున్నారు. పేద కుటుంబాల పిల్లలు ప్రైవేట్ ట్యూషన్ కు వెళ్లలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని తల్లులు కన్నీరు పెడుతున్నారని తెలుస్తోంది. ప్రభుత్వ బడిలో చదువు బాగుంటుందని నమ్మి చేర్పించామని, ఇప్పుడు ఆ నమ్మకం వమ్మవుతోందని అంటున్నారు. ఈ పరిస్థితికి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖమ్మం డీఈఓ సైలెంట్.. అనుమానాలు వైలెంట్..! వివరణ ఏది..?

ఈ అంశంపై ప్రజాజ్యోతి ఖమ్మం డీఈఓ వివరణ కోరగా డీఈఓ ఫోన్ ఎత్తకపోవడం గమనార్హం. పలుమార్లు ఫోన్ చేసిన సరైన సమాధానం రాలేదు. దీంతో అధికారి తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల్లో హాజరు పరిశీలన ఎందుకు పకడ్బందీగా జరగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమస్య తెలిసినా పట్టించుకోకపోవడం వెనుక కారణమేంటని చర్చ జరుగుతోంది. బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోందా..? అనే సందేహాలు కూడా వినిపిస్తున్నాయి. పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ వస్తోంది. అధికారులు మౌనం వీడి ప్రజలకు సమాధానం చెప్పాలని కోరుతున్నారు. ఈ మౌనం మరిన్ని అనుమానాలకు దారితీస్తోందని విమర్శలు వస్తున్నాయి.

స్పందించిన భద్రాద్రి డీఈఓ .. ఆలా చేస్తే కఠిన చర్యలు తప్పవు...

ఈ అంశంపై ప్రజాజ్యోతి భద్రాద్రి డీఈఓ వివరణ కోరగా ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంటామని తెలిపారు. విధులకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతామని స్పష్టం చేసి తెలిపారు. హాజరులో అక్రమాలు తేలితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. విద్యార్థుల చదువు విషయంలో రాజీ లేదని వివరణ ఇచ్చారు. మెడికల్ లీవులు, ఉపాధ్యాయులు రిజిస్టర్లు పరిశీలిస్తామని ప్రజాజ్యోతికి తెలిపారు. ఇరు జిల్లాల కలెక్టర్లు జోక్యం చేసుకుని పాఠశాలలను గాడిలో పెట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రంగంలోకి దిగి ప్రభుత్వ పాఠశాలలను కాపాడి, పాలసీల దందా చేస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యావేతలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

- **విద్యతోనే సమాజ, దేశ అభివృద్ధి సాధ్యం- ప్రిన్సిపల్ నరేందర్**



చర్ల,నవంబర్ 11:(ప్రజాజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల చర్ల లో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ఎన్. నరేందర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రిన్సిపల్ నరేందర్ మాట్లాడుతూ విద్య అనేది సమాజ వికాసానికి, దేశ సమగ్రతకు, అభివృద్ధికి మూలస్తంభమని పేర్కొన్నారు. దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతానికి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ బలమైన పునాదులు వేశారని కొనియాడారు. నేటి యువత, ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా నైతిక విలువలు, సృజనాత్మకత, వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్. నరేందర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. సుధాకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

5 కిలోల టిఫిన్ ఐఈడీ బాంబు గుర్తింపు

- **సురక్షితంగా నిర్వీర్యం**



చర్ల , నవంబర్ 11(ప్రజాజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన సుమారు 5 కిలోల బరువున్న టిఫిన్ ప్రెజర్ ఐఈడీ బాంబును పోలీసులు గుర్తించి సురక్షితంగా నిర్వీర్యం చేశారు.కరకేలి నుంచి బేడ్రే వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న మట్టి కాలిబాట వద్ద మావోయిస్టులు గతంలో ఈ బాంబును అమర్చినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న బాంబు నిర్వీర్య దళం (బీడీఎస్), బేడ్రే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.అనంతరం నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటిస్తూ డిమైన్ ఆపరేష న్ నిర్వహించి బాంబును సురక్షితంగా నిర్వీర్యం చేశారు. ఈ ఐఈడీని ప్రెజర్ స్విచ్ వ్యవస్థతో అమర్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌ను బీజాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో బీడీఎస్, బేడ్రే పోలీసులు సంయుక్తంగా చేపట్టారు.

రైతు గర్జన సభను జయప్రదం చేయాలి

- **సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య**



ములకలపల్లి నవంబర్ 11 (ప్రజాజ్యోతి): ఈ నెల 15న నల్గొండలో నిర్వహించే రైతు గర్జన సభకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలనిసీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పోడియం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. మురసు తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలో లింక్ డిస్ట్రిబ్యూటరీ కాలువలను వెంటనే నిర్మించి జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోతు రావూజ్, నిమ్మల మధు, గుగులోతు దేవేందర్, వర్షా శ్రీరాములు, బైరు ప్రసాద్, కుంజా రాంమూర్తి, గోపగాని లక్ష్మీనరసయ్య, గుగులోతు రవీందర్, కోండ్రు రాఘవయ్య, గద్దం వెంకటేశ్వర్లు, మడకం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత పీహెచ్ఎన్ లక్ష్మి మృతి



ములకలపల్లి, నవంబర్ 11 (ప్రజాజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రెండు దశాబ్దాల పాటు విశేష వైద్య సేవలందించిన విశ్రాంత పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్) గోరిజవోలు లక్ష్మి (83) బుధవారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా వృద్ధాప్యసమస్యలతో బాధపడుతున్న ఆమె వారం రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1985 నుంచి 2005 వరకు మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఆమె విశేష సేవలందించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మి మృతి విషయం తెలుసుకున్న మండలంలోని పలువురు ప్రముఖులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య సదుపాయాలు అంతగా అందుబాటులో లేని రోజుల్లో గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆమె అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

ప్రాణరక్షణలో ప్రతిభకు గుర్తింపు

- బేతపల్లి చెరువు ప్రమాద బాధితుల రక్షణలో కీలక పాత్ర
- దమ్మపేట ఫైర్ ఫైటర్‌కు డీజీ ప్రశంసాపత్రం



దమ్మపేట, నవంబర్. 11 (ప్రజాజ్యోతి): ఆపదలో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడి విధి నిర్వహణలో తన అంకితభావాన్ని చాటిన దమ్మపేటకు చెందిన ఫైర్ ఫైటర్ తోట చెన్నారావుకు ఉన్నతస్థాయి గుర్తింపు లభించింది. సత్తుపల్లి మండలం బేతపల్లి చెరువు వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తితో కూడిన సేవలను గుర్తించిన ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్, బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చెన్నారావుకు ప్రశంసాపత్రం అందజేశారు. ప్రాణరక్షణ సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు దక్కడం పట్ల దమ్మపేట ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భక్తుల మాలధారణలు

- కార్తీక మాసం మొదటి బుధవారం వందలాది మంది భక్తులు అయ్యప్ప దీక్ష స్వీకారం





ఇల్లెందు, నవంబర్ 11 (ప్రజాజ్యోతి) కార్తీక మాసం మొదటి బుధవారం సందర్భంగా ఇల్లందు పట్టణంలో అయ్యప్ప స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో మాలధారణ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు బుధవారం అయ్యప్ప దీక్షను స్వీకరించి మాలలు ధరించారు. ఇల్లందు పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఉన్న వినాయకుడి ఆలయం, హరిహర క్షేత్రంతో పాటు పలు ఆలయాల్లో గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారణ కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరిగాయి. ఈ సందర్భంగా గురుస్వాములు ఏటుజెడ్ శ్రీను స్వామి, కొండ శ్రీను స్వామి అయ్యప్ప భక్తులకు పవిత్ర మాలలు వేసి దీక్షను ప్రారంభించారు. అయ్యప్ప నామస్మరణలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయాల ప్రాంగణాలు భక్తిమయంగా మారాయి. మండల దీక్షను ప్రారంభించిన భక్తులు నిష్ఠ, నియమాలతో స్వామివారి సేవలో తరించేందుకు సిద్ధమయ్యారు. మాలధారణ కార్యక్రమాల్లో భక్తులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే భూభారతి

- కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని ప్రవేశ పెట్టింది
- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు
- భూ భారతి – భూ రీసర్వే అవగాహన సదస్సులో పాల్గొన్న కొత్వాల





పాల్వంచ, నవంబర్ 11, ప్రజాజ్యోతి: తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భూ భారతి – భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం పాల్వంచ ఇంజనీర్స్ అసోసియేషన్ హాలులో రెవెన్యూ అధికారులు, రైతులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు భూ రీసర్వే చేపట్టి నిజమైన రైతులకు హక్కు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాల్వంచ పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న 999, 444, 817, 727 సర్వే నంబర్లకు సంబంధించిన భూములను రీసర్వే చేసి పట్టణ ప్రజల భూసమస్యలకు పరిష్కారం చూపించనున్నట్లు కొత్వాల పేర్కొన్నారు. భూములు, గృహాలకు సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు, గృహ యజమానులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. భూ భారతి – భూ రీసర్వే అవగాహన సదస్సులో పాల్గొన్న కొత్వాల

అయ్యప్ప స్వామి దీక్ష ఎంతో పవిత్రమైనది

- అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందించడం ఎంతో పుణ్యప్రదం
- పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు
- అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కొత్వాల





పాల్వంచ, నవంబర్ 11, ప్రజాజ్యోతి: అయ్యప్ప స్వామి దీక్ష ఎంతో పవిత్రమైనదని, దేవాలయంలో నిర్వహించే అన్నదానం మహాదానమని పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు, ట్రస్ట్ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అయ్యప్ప దీక్షల సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అయ్యప్ప దీక్షలు చేపట్టిన స్వాములకు అన్నప్రసాదం అందించడం ఎంతో పుణ్యప్రదమని అన్నారు. దీక్ష తీసుకున్న స్వాములు నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ సభ్యులు బండెల శ్రీనివాస్, మేడిద సంతోష్ గౌడ్, గురుస్వాములు వెంపలి సత్యం (గుడివాడ), శంకరమణి, రాజలింగం, కేశబోయిన కోటేశ్వరరావు, బేతం శెట్టి వెంకట్, బి.ఎన్. చారి, మల్లెల నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈకిడ్స్ స్పోర్ట్స్ డే వేడుకలు

- ఆడుతూ పాడుతూ నేర్చుకుందాం
- ఆరోగ్యంగా, ఆనందంగా ఎదుగుదాం
- నారాయణ ప్రీమియర్ లీగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

పాల్వంచ, నవంబర్ 11, ప్రజాజ్యోతి: పాల్వంచ నెహ్రూనగర్‌లోని నారాయణ పాఠశాల క్యాంపస్‌లో ఈకిడ్స్ విభాగానికి చెందిన నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారుల కోసం నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ డే వేడుకలు నవంబర్ 10, 11 తేదీలలో ఘనంగా జరిగాయి. “ఆడుతూ పాడుతూ నేర్చుకుందాం.. ఆరోగ్యంగా, ఆనందంగా ఎదుగుదాం” అనే సందేశంతో నిర్వహించిన ఈ వేడుకలు చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యతో పాటు క్రీడలకు కూడా నారాయణ పాఠశాలల్లో సముచిత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాల్వంచ హౌకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చదువుతో పాటు ఆటపాటల్లోనూ చురుకుగా పాల్గొంటూ తమలోని ప్రతిభను వెలికితీయాలని చిన్నారులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు మాట్లాడుతూ చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన పోటీతత్వం, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులు సంగీత (ఆర్ అండ్ డి), నీలిమ (కోఆర్డినేటర్), ప్రవీణ్ కుమార్ (ఈ బెక్నో కోఆర్డినేటర్), పద్మ (వైస్ ప్రిన్సిపాల్) పాల్గొని చిన్నారులను అభినందించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ క్రీడా పోటీలు, వినోదాత్మక ఆటలు, శారీరక చురుకుదనాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల చిరునవ్వులు, కేరింతలు, ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పాల్గొన్న ప్రతి చిన్నారిని ప్రోత్సహిస్తూ బహుమతులు, ప్రశంసలు అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. “ప్రతి చిన్నారిలో ఒక విజేత ఉన్నాడు. క్రీడలే ఆ ప్రతిభకు తొలి వేదిక” అనే స్ఫూర్తిదాయక సందేశంతో నారాయణ ప్రీమియర్ లీగ్ ఈకిడ్స్ స్పోర్ట్స్ డే వేడుకలు విజయవంతంగా ముగిశాయి.



రైతాంగ సమస్యలపై సమరశంఖం.. ఏఐకేఎస్ మహాసభలకు పిలుపు

- తెలంగాణ రైతుసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బహిరంగ సభ గోడపత్రిక ఆవిష్కరణ



దమ్మపేట,నవంబర్. 11(ప్రజాజ్యోతి):: నల్గొండ లో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత రైతుసంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. నవంబర్ 15న నల్గొండలో నిర్వహించనున్న రైతాంగ ప్రదర్శన, రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతులో పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏఐకేఎస్ తొమ్మిది దశాబ్దాలుగా నిరంతరం పోరాడుతోందన్నారు. రైతాంగ సమస్యలపై జరిగే ఈ జాతీయ మహాసభల సందర్భంగా 15న లక్షలాది మంది రైతులతో నిర్వహించనున్న ప్రదర్శన, బహిరంగ సభను రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తమండలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, జీసీసీ హమాలీ మేస్త్రీ సత్యం, రైతు నాయకుడు గడ్డిపాటి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొలికపోగు శ్రీనివాసరావు, వెంకటయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాస, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల రహదారికి మరమ్మతులు చేపట్టాలి

- పుసుకుంట–కట్కూరు మార్గాన్ని వెంటనే బాగుచేయాలి
- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సోయం వీరభద్రం డిమాండ్



దమ్మపేట, నవంబర్. 11 (ప్రజాజ్యోతి): మురసు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పుసుకుంట–కట్కూరు ఆదివాసీ గ్రామాల రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సోయం వీరభద్రం కోరారు. బుధవారం దమ్మపేట మండలం ఆర్లపెంటలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి నూతన ఆలయ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.10,116లను కమిటీ సభ్యులకు అందజేసి, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో పుసుకుంట–కట్కూరు గ్రామాల మధ్య రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. సుమారు పది కిలోమీటర్ల దూరంలోని ఈ ఆదివాసీ గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం దమ్మపేటకు రావాలంటే ఇదే ప్రధాన మార్గమని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు, వారధి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంకా ముత్యాలరావు, తొలెం మల్లేష్, సోయం నాగేశ్వరరావు, మడకం గంగరాజు, వసంతరావు, వంకా రాంబాబు, వగ్గెల జోగారావు, సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకం రాక .... నిరీక్షణ

- నిరుద్యోగ యువకుల కల నెరవేర్చేనా...!
- గత ప్రభుత్వం మాదిరి సాంక్షన్ అయ్యి రద్దు అయితాయా!
- నిరుద్యోగ యువత చూపు రాజీవ్ యువ వికాసం వైపు
- ఇంకా ఎన్నాళ్ళు ఈ నిరీక్షణ?

లక్ష్మీదేవి పల్లి, నవంబర్ 11 ,ప్రజాజ్యోతి: తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ప్రారంభించి రెండు సంవత్సరాలు అయినప్పటికీ అప్లై చేసిన నిరుద్యోగులు ఇంకా ఎన్నాళ్లకు ప్రారంభించి సెలక్టెడ్ జాబితా లిస్టు తయారుచేసి పంపుతారని ఆందోళన చెందుతున్నారు ఈ రాజీవ్ ఈ వికాసం పథకం మీద ఎటువంటి స్పందన లేకపోవడంతో నిరుద్యోగుల మనసులో గందరగోళం నేల కొంటుంది గత ప్రభుత్వం మాదిరి సాంక్షన్ అయ్యి రద్దు అయితాయా అనే అపోహ కూడా వస్తుంది కాబట్టి మరి నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం నిర్వర్యం అవుతుందా లేక ముందడుగు సాగుతుం దా గత సంవత్సరం బడ్జెట్లో రాజీవ్ యువ వికాసం కోసం బడ్జెట్ కేటాయించినప్పటికీ రాజీవ్ వికాసం అమలు కు నోచుకోలేదు రాజీవ్ యువ వికాసం కింద కేటాయించిన బడ్జెట్ ఎటు వెళ్లింది అనే అపోహాలు వినిపిస్తా ఉన్నాయి నిరుద్యోగుల బాధలను కనికరించి ఉపాధి అవకాశాలు దిశగా రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేసి రుణాలు మంజూరు చేయాలని తద్వారా ఆర్థికంగా తమ కుటుంబాలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం తోడ్పాటు చేసిందని ఆనందం ఉంటుందని లేకపోతే గత ప్రభుత్వం మాదిరి ఈ ప్రభుత్వం కూడా అదే గతి పడుతుందని నిరుద్యోగ యువకులలో ఆలోచనలు మొదలయ్యాయి అని గుసగుసలు వినిపిస్తున్నాయి

నిశ్చితార్థ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే తాటి



ములకలపల్లి నవంబర్ 11 (ప్రజాజ్యోతి): మండలంలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన తాటి రవికుమార్తె శైలజ నిశ్చితార్థ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాటి ప్రవీణ్, తాటి రంగన్న, పోడియం శ్రీను, పోడియం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

- చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



ములకలపల్లి, నవంబర్ 11(ప్రజాజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, ప్రశ్నించే తత్వం, సృజనాత్మకతను పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ములకలపల్లిలో చెకుముకి సైన్స్ సంబరాలు–2026 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికితీయడంతో పాటు, విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ నెల 12న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ వెంకన్న, హరిలాల్ పాల్గొన్నారు.

పాల్వంచలో దారుణం

- మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారం
- పాల్వంచ పీఎస్ లో కేసు నమోదు



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 11,(ప్రజాజ్యోతి) ఉపాధి వెతుక్కుంటూ పట్టణానికి వలసవచ్చిన ఓ నిరుపేద యువతిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన బుధవారం పాల్వంచలో వెలుగు చూసింది, ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 19 ఏళ్ల యువతి బ్రతుకుదెరువు కోసం పాల్వంచకు వలస వచ్చింది. ఈ క్రమంలో ఆమె కూలి పని కోసం స్థానిక ప్రాంతంలో వేచి చూస్తోంది. దీన్ని గమనించిన ఆటో డ్రైవర్ నరసింహారావు అనే వ్యక్తి ఆమె దగ్గరికి వచ్చి, మంచి పని ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఆ మాటలను నమ్మిన యువతిని తన ఆటోలో ఎక్కించుకుని ఓ గుర్తుతెలియని రహస్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై లైంగిక దాడికి (అత్యాచారానికి) పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలను అక్కడే వదిలేసి పరారయ్యాడు. బాధితురాలు తేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టౌన్ పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు, పరారీలో ఉన్ననిందితుడు నరసింహారావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దమ్మపేట పోలీసుల కార్డన్ సెర్చ్

- కొడిసేలగూడెం లో పోలీసుల మెరుపు తనిఖీలు
- 52 ఇళ్లలో తనిఖీలు.. 38 వాహనాల పత్రాల పరిశీలన
- గంజాయి, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై గ్రామస్థులకు అవగాహన



దమ్మపేట,నవంబర్. 11(ప్రజాజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున అంకంపాలెం గ్రామ పరిధిలోని కొడిసేలగూడెంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలు, పాల్వంచ సబ్ డివిజనల్ పోలీసు అధికారి సూచనల మేరకు అశ్వారావుపేట సీఐ నాగరాజు ఆధ్వర్యంలో దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ , అశ్వారావుపేట ఎస్సై తో పాటు పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 52 ఇళ్లను తనిఖీ చేశారు. 33 ద్విచక్ర వాహనాలు, నాలుగు ప్రయాణికుల ఆటోలు, ఒక ట్రాక్టర్ సహా మొత్తం 38 వాహనాల పత్రాలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన నాలుగు ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమైన సీఐ నాగరాజు మాట్లాడుతూ గంజాయి సేవించడం, అక్రమ రవాణా వంటి మాదకద్రవ్యాల కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, గంజాయి అక్రమ రవాణా గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కొత్త పెన్షన్ల ప్రాసీడింగ్ ఆర్డర్ల పంపిణీ

► లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తాం
కార్పొరేటర్ బత్తుల మధుచంద్

పాల్వంచ, నవంబర్ 11, ప్రజాజ్యోతి: పాల్వంచ 38వడివిజన్‌కు సంబంధించి కొత్తగా మంజూరైన వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళల పెన్షన్ల ప్రొసీడింగ్ ఆర్డర్లను నవంబర్ 13వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పాల్వంచలోని సుగుణ ఫంక్షన్ హాల్‌లో అందజేయనున్నట్లు 38వడివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 38వ డివిజన్‌కు సంబంధించిన తుది లబ్ధిదారుల జాబితా ఇంకా అందుబాటులోకి రాలేదని పేర్కొన్నారు. జాబితా వచ్చిన వెంటనే కొత్తగా పెన్షన్లు మంజూరైన అర్హులైన లబ్ధిదారులందరికీ ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు.కావున 38వ డివిజన్‌కు చెందిన కొత్తగా పెన్షన్లు మంజూరైన అర్హులైన లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి,సంబంధిత కార్యక్రమానికి హాజరుకావాలని కార్పొరేటర్ బత్తుల మధుచంద్ కోరారు.

టిప్పర్ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

► ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన
వెంకటేశ్వరరావు



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 11, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చండ్రుగొండ మండలం రామక్క బంజర గ్రామానికి చెందిన పద్దం వెంకటేశ్వరరావు తన సొంత ట్రాక్టర్‌పై ఎర్రగుంట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో కొత్తగూడెం వైపు వెళ్తున్న బొగ్గు టిప్పర్ వెనుక నుంచి ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రోడ్డు పక్కకు పడిపోగా, ట్రాక్టర్ నడుపుతున్న వెంకటేశ్వరరావు తలకు తీవ్ర గాయాలై ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు.సమాచారం అందుకున్న అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి కేసు నమోదు చేసి, మృతదేహానికి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ప్రభుత్వ చేయూత

► ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపహాడ్,నవంబర్11(ప్రజా జ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడం ద్వారా వారి కష్టాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోం దని పేర్కొన్నారు.బూర్గంపహాడ్ మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లల వివాహ సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభు త్వం ఈ పథకాల ద్వారా సాయం అందిస్తోందన్నారు. పేద కుటుంబా లు అప్పులపాలు కాకుండా, వివాహ వేడుకలను సంతోషంగా నిర్వహించుకునేందుకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ ప్రసాద్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సుధాకర్‌రెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పేదల కంటి సమస్యలకు ఉచిత వైద్య భరోసా

- ఇల్లందులో విజయవంతంగా మెగా కంటి వైద్య శిబిరం
- 300 మందికి పైగా కంటి పరీక్షలు
- అవసరమైన వారికి కళ్లద్దాల పంపిణీ
- శస్త్రచికిత్సల కోసం వైద్యుల సిఫార్సు



ఇల్లెందు, నవంబర్ 11 (ప్రజా జ్యోతి) ఆర్థిక స్థోమత లేక కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శ్రీ ఆదిత్య సాయి హీరో మోటార్స్, మినీ ఫంక్షన్ హాల్, ఆదిత్య ఫెర్టిలైజర్స్ నిర్వాహకుడు ప్రొద్దుటూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఇల్లందులోని ఆయనకు చెందిన ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఇల్లందు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాల్వంచ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొని 300 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్యలు, ఇతర కంటి సంబంధిత ఇబ్బందులను వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు అందించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడంతో పాటు, కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు.వ్యాపార రంగంలో రాణిస్తూనే సామాజిక బాధ్యతను గుర్తించి పేదలకు వైద్య సేవలు అందించేందుకు ప్రొద్దుటూరు నాగేశ్వరరావు ముందుకు రావడం పలువురి ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులతో కంటి వైద్యం చేయించుకోలేని పేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు, శస్త్రచికిత్సల కోసం మార్గం చూపడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.పేదల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, భవిష్యత్తులోనూ మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని స్థానికులు ఆకాంక్షించారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు జిల్లా వ్యాప్తంగా ముందస్తు వ్యవసాయ కార్యాచరణ

- నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి
- వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 11 ,(ప్రజా జ్యోతి) కొత్తగూడెం జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, లోటు వర్షపాతాన్నిదృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు ప్రణాళికతో పలు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల లభ్యత, సాగునీటి వనరుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో రైతులు పంటల సాగులో తగిన మార్పులు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పంటల సాగు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు తగిన సూచనలు అందిస్తున్నారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి,నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా సాగునీటి లభ్యతపై అనిశ్చితి ఉన్న ప్రాంతాల్లో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా స్థానిక పరిస్థితులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు. రబి 2025–26 సీజన్‌లో జిల్లాలో మొత్తం 2,00,529 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, రబీ 2026–27 సీజన్‌లో సుమారు 1,38,695 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే సాగు విస్తీర్ణం సుమారు 31 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. గతంలో 89,348 ఎకరాల్లో సాగైన వరి పంటను ఈ సీజన్‌లో 29,300 ఎకరాలకు పరిమితం చేయాలని అంచనా వేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు . అదే సమయంలో పప్పుధాన్యాల సాగును 1,053 ఎకరాల నుంచి 9,300 ఎకరాలకు, నూనెగింజల సాగును 1,951 ఎకరాల నుంచి 3,509 ఎకరాలకు పెంచేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకొని బోరుబావుల పరిస్థితిని మండలాల వారీగా సమీక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 60,957 బోరుబావులు ఉండగా, వీటిలో 49,978 బోరుబావులు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని, 10,979 బోరుబావుల్లో పాక్షికంగా నీటి లభ్యత ఉందని,పూర్తిగా ఎండిపోయిన లేదా పనిచేయని బోరుబావులు లేవని నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.పంటల్లో నేల తేమ తగ్గకుండా మల్చింగ్ పద్ధతిని అవలంబించాలని, బిందు సేద్యం వంటి సూక్ష్మసాగునీటి పద్ధతులను వినియోగించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్, యూకలిప్టస్ తోటల వరుసల మధ్య వేరుశనగ, అరటి, మినుము వంటి అంతర పంటలు సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అయితే చెట్ల మధ్య దూరం, పంటకు అందే సూర్యరశ్మి, నేలలో తేమ, చెట్ల వయస్సు వంటి అంశాలను పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అంతర పంటల సాగుకు సలహాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. దీనివల్ల అందుబాటులో ఉన్న భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు .అశ్వారావుపేట మండలంలో యూకలిప్టస్ తోటల్లో మినుము అంతర పంటగా సాగు చేస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంట ఎదుగుదలదశ,నేలలో తేమ పరిస్థితులు, చెట్ల మధ్య అంతరం, పంటకు అందుతున్న వెలుతురు వంటి అంశాలను పరిశీలించి, అంతర పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు అందించాలని అధికారులకు తెలిపారు.పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ఎం ఎస్ ఎ పి 2026–27 పథకం కింద సబ్సిడీపై పప్పుధాన్యాల విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమం ద్వారా 2026 అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు జిల్లాలోని గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి పంటల ఎంపిక, నేలలో తేమ సంరక్షణ, సాగునీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులను భాగస్వాములను చేసి రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని రైతులందరూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.